జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
## తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com
శనివారం | 8-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 241 పేజీలు: 4 వెల : రూ.7



రాత్రివేళ నదిలో వాహనాలు


# చీకటి.. దందా!



* అర్ధరాత్రి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు * బరితెగించిన ఇసుకాసురులు * అనుమతులకు మించి వంశధారలో తవ్వకాలు * తెరవెనుక అధికార పార్టీ నేతలు * అక్రమాలు పట్టనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం * ప్రభుత్వ ఆదాయానికి గండి * నది గమనం మారే అవకాశం *మాతల వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం



**కొత్తూరు, ఫిబ్రవరి7 (వార్త):** పుష్పా సినిమాలో ఎర్రచందనం మాదిరిగా.. ఇక్కడ ఆంధ్రా ఇసుకను అక్రమంగా ఒడిశా మీదుగా రాత్రికి రాత్రి పెద్దసంఖ్యలో లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతున్నారు. కొత్తూరు మండలంలోని నివగాం, ఆకులతంపర ఇసుక ర్యాంపులలో చీకటి దందా జోరుగా సాగుతోంది. నిబంధనలు కాలరాసి అర్ధరాత్రి యంత్రాలతో వంశధారలో ఇసుకను తోడేస్తున్నారు. అధికార పార్టీ అండదండలు ఉండడంతో ఇసుకాసురుల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. స్థానిక అధికారుల పర్యవేక్షణ లోపంతో చెలరేగిపోతున్నారు. ఎవరైనా అడ్డుకుంటే చితకబాదుతున్నారు. నివగాం, ఆకుల తంపర ఇసుక రీచ్‌ల మీద ఇదివరకే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఫిర్యాదు ఇచ్చిన మరుసటి రోజు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్తున్నారు తప్ప ఎటువంటి చర్యల్లేవు. ఆ మరుసటి రోజు నుంచే మళ్లీ యధావిధిగా ఇసుక దందా కొనసాగుతునే ఉంది. ఈ ఇసుక రీచ్‌లకు సంబంధించిన లారీలను నివగాం, వసప, మాతల, మదనాపురం రహదారి వద్ద పగటిపూట ఉంచుతున్నారు. ఆకులు తంపర రీచ్‌కు సంబంధించిన లారీలను కలిగాం, గూనభద్ర, సోమ రాజపురం, ఆకుల తంపర వద్ద కొన్ని పదుల సంఖ్యలో పగటిపూట వాహనాలను నిలుపుతున్నారు. రాత్రి తొమ్మిది నుంచి వేకువ జామున నాలుగు గంటల వరకు మాత్రం కనీసం 60 నుంచి 80 వరకు లారీలను నదిలో దించి జెసిబిల ద్వారా ఇసుకను తవ్వి లోడింగ్ చేసి ఒరిస్సా సరిహద్దులలో ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట టన్నుల కొద్దీ ఇసుకను అనుమతికి మించి లోతుగా తవ్వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని కొంతమంది రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఈ వ్యవహారం మొత్తం అధికారులకు తెలియదా అంటే మాత్రం అది ముమ్మాటికి అబద్ధమే అవుతుంది. 15 అడుగుల లోతుగా ఇసుక తవ్వడం వల్ల నదీ గమనం మారడంతో పాటు నివగాం-మాతల వంతెనకు ప్రమాదం పొంచివున్నదని స్థానిక గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి ఈ చీకటి దందాపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని సమీప గ్రామస్థులు కోరుతున్నారు.



వేణుగోపాలునికి..
## క్షీరాభిషేకం

* శ్వేతగిరిలో శోభాయాత్ర
* పట్టువస్త్రాలు సమర్పించిన ధర్మకర్త మధురెడ్డి
* నేడు చక్రతీర్థ స్నానం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 8 (వార్త):** శాలిహుండం శ్వేతగిరి భక్తజనంతో పులకించింది. కాళీయ మర్ధన వేణు గోపాలుని తిరుకల్యాణ మహెూత్సవం శుక్రవారం శోభా యాత్రతో ప్రారంభమైంది. అర్చకుడు మహేంద్రాడ సాయి శర్మ నేతృత్వంలో ఉత్సవ మూర్తులను గ్రామాల్లో ఊరేగించారు. అర్ధరాత్రి ఒంటి గంటలకు స్వామికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. క్షీరాభిషేకం, విశేష అర్చన, పుష్పాలంకరణ అనంతరం భక్తుల్ని స్వామి వారి దర్శనానికి అనుమతించారు. శనివారం చక్రతీర్థ స్నానం కార్యక్రమం జరగనుంది. పెద్ద ఎత్తున భక్తులు శ్వేతగిరికి తరలిరానున్న దృష్ట్యా సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సిక్కోల్‌లోనే తండేల్ విజయోత్సవ సభ

* గంగపుత్రుడి యదార్థం గాథ ఆధారంగా సినిమా * నేను కథ రాసి నాగచైతన్యకు వినిపించా * నాది శ్రీకాకుళమే * కథా రచయిత కార్తీక్



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి7 (వార్త):** తండేల్ సినిమా విజయోత్సవ సభను త్వరలో శ్రీకాకుళం నగరంలోనే నిర్వహిస్తామని కథారచయిత కార్తీక్ తీడ తెలిపారు. సినిమా విడుదల సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని రామలక్ష్మణ థియేటర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళానికి చెందిన 22 మంది మత్స్యకారుల యథార్థ గాథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కిందన్నారు. గుజరాత్ రాష్ట్రం వీరావెల్‌లో చేపల వేటకు వెళ్లి.. పాకిస్థాన్ జల సరిహద్దుల్లోకి వెళ్లిపోవడంతో అక్కడి పోలీసులకు చిక్కి జైలుపాలైన మత్స్యకారుల కష్టాలను పత్రికల్లో చదివి తెలుసుకున్నానన్నారు. ఆ మత్స్యకారుల కుటుంబాలను కలిసి వివరాలు సేకరించానన్నారు. నాలుగేళ్లు కష్టపడి ఒక కథను రాశానన్నారు. ఈ కథను హీరో నాగచైతన్య, డైరెక్టర్ చందూ మొండేటి, నిర్మాత బన్నీ వాసుకు వినిపించానన్నారు. వారికి కథ నచ్చడంతో ఈ సినిమా ప్రారంభమైందని తెలిపారు. నాది శ్రీకాకుళం జిల్లాయేనని చెప్పారు. ఈ సినిమాను శ్రీకాకుళం జిల్లాలోనే చూడడం ఆనందంగా ఉందని, ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ వస్తోందన్నారు. ఆయన వెంట డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన రామారావు, జిల్లా నాగచైతన్య అభిమాన సంఘ అధ్యక్షుడు గురుచరణ్, తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు..
# పోలీస్ కుటుంబాలు దూరం

* కుటుంబాలను తీసుకురావద్దని ముందే హుకుం * ఆవేదన వ్యక్తం చేసిన పలు కుటుంబాలు

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి7 (వార్త):** రాష్ట్ర పండుగ అయిన రథసప్తమి వేడుకలకు ఈ సారి పోలీసు కుటుంబాలు దూరమయ్యారనే చెప్పాలి. ప్రతి ఏడాది పోలీసులు పెద్ద ఎత్తున అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం వద్ద బందోబస్తుకు వెళతారు. తమ కుటుంబీకులు స్వామి వారి దర్శనానికి వస్తే అధికారులకు, తోటి సిబ్బందికి ఒక మాట చెప్పి ఉచిత దర్శనం క్యూలైన్లలో కాకుండా శీఘ్ర దర్శనం లైనులోకి పంపిస్తుండేవారు. ఇది అందరికీ తెలిసిందే. ఈసారి పోలీసులు తమ కుటుంబాల సేవలో నిమగ్నమైతే చర్యలు తప్పవని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చారట. దీంతో ముందుగానే పోలీసులు తమ కుటుంబాలకు ఈసారి స్వామి దర్శనానికి రావొద్దని చెప్పారట. ఈవిషయమై పోలీసులు, వారి కుటుంబాల్లో చర్చకు దారితీసింది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది స్వామి వారి దర్శనం చేసుకోలేకపోయామని, కనీసం పోలీసు కుటుంబాల కోసమైనా ఒక టైమ్ స్లాట్ ఇచ్చివుంటే దర్శనం చేసుకునేవారం కదా అని ఆవేదన వ్యక్తం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# మందస ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్‌నాయుడు



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** మందస మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా నడిమింటి రమేష్‌నాయుడు మందస మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వజ్రపుకొత్తూరు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌నాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలతో ఉన్నతాధికారులు మందసకు ఇంచార్జిగా నియమించారు. ఆయనకు మండల పరిషత్ పరిపాలనాధికారి బూరగాన బుషేశ్వరరావుతో పాటు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శి లు సచివాలయం సిబ్బంది, పలువురు నాయకులు కలిసి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

# కేంద్ర మంత్రిపై తప్పుడు ప్రచారాలు సరికావు

**-టిడిపి రాష్ట్ర నాయకులు సూరిబాబు హితవు**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** అత్యంత ప్రజాదరణ కలిగిన గాయని మంగ్లీ జిల్లాకు రాష్ట్ర పండుగరసప్తమి వేడుకలు నేపథ్యంలో రావడం పై ఇటీవల పలు మీడియాలో రాస్తున్న అసత్య ప్రచారాలను అలాగే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పై చేస్తున్న దుష్ప్రచారాలు సరికావని టిడిపి రాష్ట్ర నాయకులు విభూది సూరిబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మాజీమంత్రి కింజ రాపు ఎర్రమనాయుడు కుమారుడుగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రామ్మోహన్ నాయుడు అనతి కాలంలోనే ప్రజాభిమానంతో కేంద్రమంత్రి స్థాయికి ఎదిగారని, ఆయన ఎదుగుదల జిల్లాకే గర్వకారణమని సూరిబాబు అన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన యువ ఎంపీగా ప్రస్తుతం కేంద్ర మంత్రిగా క్రియాశీలక పాత్ర పోషిస్తూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సీఎం చంద్రబాబు సూచనలతో ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. విమాన రంగ అభివృద్ధిలో ప్రగతి సాధిస్తున్నారని, ముఖ్యంగా జిల్లాలో రాష్ట్ర పండుగ నిర్వహణలో హెలీ టూరిజం అధిక ప్రాముఖ్యత సంతరించుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆయనపై విమర్శలు చేసే ముందు కాస్త ఆలోచించాలని సద్విమర్శలు అయితే పర్వాలేదు కానీ రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం చేయడం సరికాదని మరోసారి హితవు పలికారు.



# న్యాయ విజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఉండాలి

**-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**

**కార్యదర్శి సన్యాసి నాయుడు**




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** విద్యతో పాటు న్యాయ విజ్ఞానం ప్రతీ ఒక్కరికీ ఉండాలని తద్వారా శాంతియుత సమాజ స్థాపన జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసి నాయుడు అన్నాడు. శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాదికారసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 న జరగనున్న ప్రపంచ వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం నగజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసి నాయుడురంలో ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద గల తిరుమల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాయుడు మాట్లాడుతూ ఆర్టికల్ 21 గురించి విపులంగా వివరించారు. రాజ్యాంగం పిల్లలకు అనేక హక్కులు కల్పించిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంగించకూడదన్నారు. స్వేచ్ఛ .సమానత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులని. వీటిని ఉల్లగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చదువుకోవలిసిన వయస్సులో ఉన్న విద్యార్థులు ఎక్కడైనా వెట్టి చాకిరి చేస్తూ కనిపిస్తే జిల్లా న్యాయ సేవాధికారసంస్థ దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మనం చేసే పనిలో ఖచ్చితత్వం ఉండాలని నేటి బాలలే రేపటి పౌరులు, దేశ భవిష్యత్తు మీ చేతుల్లో ఉందన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ న్యాయ నిపుణులు సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో కాన్ఫిడెన్స్ లెవెల్స్ ఎక్కువగా ఉండాలి. గురువులు చెప్పిన విషయాలు శ్రద్ధగా విని తిరిగి చదవడం చాలా ముఖ్యం అన్నారు. ఏ రోజు చెప్పినది ఆ రోజు చదవడం ద్వారా ఒత్తిడి తగ్గుతుంది. ఫైనల్ ఎగ్జామ్ సులభంగా రాయవచ్చు... అని న్యాయమూర్తి సన్యాసి నాయుడు సూచించారు.. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాసంస్థ సభ్యులు గేదెల ఇందిరా ప్రసాద్. కళాశాల ప్రిన్సిపాల్ విటి నాయుడు,.. ఎంవీజీ శంకర్, కళాశాల సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

# నరసింహమూర్తికి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్



**ఎచ్చెర్ల, ఫిబ్రవరి 7(వార్త):** డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగంలో అతిథి అధ్యాపకుడు మెండ నరసింహమూర్తికి ఏయూ డాక్టరేట్ ప్రకటించింది. ఏయూ ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య బి.లిల్లీ గ్రేస్ పర్యవేక్షణలో 'ఏపీలో విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వాలు చేస్తున్న వ్యయం' అనే అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ లభించింది. శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలం ధనుకవాడ గ్రామానికి చెందిన నరసింహ మూర్తి 15 సంవత్సరాలగా బోధనా వృత్తిలో కొనసాగడమే కాకుండా పలు జర్నల్స్ లో పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. గతంలో ఎన్ఎస్ఎస్' డివిజనల్ పీవోగా వ్యవహరించి ఉత్తమ అవార్డు కూడా అందుకున్నారు. నరసింహమూర్తికి ఈ డాక్టరేట్ లభించడం పట్ల డా.బిఆర్ఏయూ వైస్-చాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తదితరులు హర్షం వ్యక్తం చేసి, ఆయనను అభినందించారు.

# చండేశ్వరాలయం అభివృద్ధికి రూ.15వేలు



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** మందసలోని శ్రీచండేశ్వరాలయం అభివృద్ధికి దేవరవీధికి చెందిన గణేశ్ ఉత్సవ కమిటీ, దేవరవీధి యూత్ ప్రతినిధులు రూ.15 వేలు అందజేశారు. ఈ విరాళాన్ని ప్రఫుల్కుమార్సాహుమాష్టారుకు అందించారు. చారిత్రాత్మకమైన చరిత్ర ఉన్న ఆలయాన్ని అభివద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంకం గోపి, బనిశెట్టి హేమ సుందర్, జిణగ శ్రీను, అంకం వసంతరావు, డుంకురు సతీష్, పొందర భవానీ, పొందర శివ, తమ్మినాన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# 11న అరసవల్లి ఆదిత్యుని హుండీల లెక్కింపు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం హుండీలను ఫిబ్రవరి 11వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు శుక్రవారం ఉప కమీషనర్ భద్రాజి ఒక ప్రకటన జారీ చేశారు.

# నేడు బొగాబంద యోగాశ్రమంలో భీష్మ ఏకాదశి వేడుకలు

**మందస, ఫిబ్రవరి 7(వార్త):** బొగాబంద గ్రామంలో గల యోగాశ్రమంలో ఈ నెల 8న భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్టు యోగిని లక్ష్మీబాయిమాతాజీ చెప్పారు. ఆశ్రమ వ్యవస్థాపకులు స్వామి భాస్కరదాస్ దివ్యాశీస్సులతో, మాధవానందసరస్వతి(హిమాచల్ ప్రదేశ్) ఆధ్వర్యంలో వేకువజామున 4 గంటలకు సుప్రభాతం, అఖండజ్యోతి ప్రజ్వలన, శంఖధ్వనితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. భైరిసారంగపురం పంచాక్షరి భక్తులచే శ్రీమద్భగవత్ గీతాపారాయణం, బొంతలకోటి యతిరాజ్భగవతార్చే భీష్మచరిత్ర హరికథా కాలక్షేపం, భజన బృందాలతో భజనాకాలక్షేపం ఉంటాయన్నారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆమె కోరారు.

# సుజికీ యాక్సెస్ 125 మోడల్ ప్రారంభం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** సుజికీ యాక్సెస్ 125 నూతన మోడల్ స్కూటీని శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని పెద్దపాడు రోడ్డులో శ్రీజయలక్ష్మీ మోటార్స్ లో డిఎస్పి వివేకానంద చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్త వెహికల్ ఆడవాళ్ళకి ఎంతో సౌకర్యంగా ఉంటుందని ధర విషయంలో కూడా చాలా కంఫర్ట్ గా ఉందని మీ అందరూ వినియోగించుకోవాలని కోరుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు హెల్మెట్ ధారణ తప్పనిసరిగా పాటించాలని అన్నారు.షోరూం మేనేజర్ అంధవరపు లక్ష్మణ రావు మాట్లాడుతూ నూతన మోడల్ లో ఈస్కూటీలో ఐదు కలర్స్ వచ్చిందన్నారు. సరికొత్త ఫీచర్స్తో ఈ వాహనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నేత కంఠవేణు, సోమేశ్వరరావు, షోరం సిబ్బంది పాల్గొన్నారు.




# సీతంపేటలో గిరిజన విద్యార్థులకు ఇంటర్ ప్రవేశాలు

**సీతంపేట, ఫిబ్రవరి 7(వార్త):** సీతంపేటలోని ప్రతిభా కళాశాలలో 2025-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు చివరి తేదీ మార్చి3, ప్రవేశ పరీక్ష తేదీ మార్చి3, పరీక్ష కేంద్రం: సీతంపేట. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఆదిమ గిరిజన పిల్లలు దరఖాస్తు చేసుకోవాలి. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఒక లక్ష రూపాయలు మించి ఉండకూడదు.మరింత సమాచారం కోసం, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం లేదా గురుకులం సెల్, ఐ.టి.డి.ఏ. సీతంపేటను సంప్రదించగలరు.

# శ్రీకాకుళంలో పీఎంజే జ్యువెల్స్ ప్రారంభం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రియమైన ఫైన్ జ్యువెల్లరీ బ్రాండ్ అయిన పీఎంజే జ్యువెల్స్ శ్రీకాకుళంలో నూతన షోరూమ్‌ను శుక్రవారం ప్రారంభించింది. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ భార్య ప్రమీలతో పాటు పీఎంజే జ్యువెల్స్ ఆంధ్రప్రదేశ్ బిజినెస్ హెడ్ హైదర్‌అలీ, వైజాగ్ క్లస్టర్ డైరెక్టర్ ఆనంద్‌జిలగం ఈ కొత్త అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. శ్రీకాకుళంలోని కస్టమర్ల విభిన్న అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఈ స్టోర్ ప్రత్యేకంగా రూపొందించబడింది. ముఖ్యంగా వజ్రాలు, బంగారం మరియు విలువైన స్టోన్స్ తో విస్తృతమైన డిజైన్లను కలిగి ఉంది. పీఎంజే యొక్క అత్యుత్తమ, ఇంతకు ముందు చూడని ఆకర్షణయమైన డిజైనర్ ఆభరణాల శ్రేణి, హ్యాండ్ మేడ్ క్రియేషన్‌లు విభిన్న ప్రాంతాల వారీగా వివాహ ఆభరణాలు ఈ సేకరణలో భాగంగా ఉన్నాయి. అన్ని రకాల ఫంక్షన్లు, పార్టీలు, వేడుకలకు అనువైన తేలికపాటి క్రియేషన్‌లు కూడా ఈ స్టోర్ లో అందుబాటులో ఉంటాయి. ఈ నూతన స్టోర్ తమ వినియోగదారులందరికీ తాజా, అత్యుత్తమమైన, గతమెరుగని అద్భుతమైన వజ్రాల పెళ్లి ఆభరణాల విస్తృత శ్రేణిని అందిస్తుందని హామీ ఇస్తుంది. ఈ సందర్భంగా కూన ప్రమీల మాట్లాడుతూ "శ్రీకాకుళం లోకి పీఎంజే జ్యువెల్స్ విస్తరించడం ఆనందంగా ఉంది. నాణ్యత, చేతిపనుల పట్ల వారి అంకితభావం గొప్పది, అభినందనీయమైనది. ఈ కొత్త స్టోర్ శ్రీకాకుళంతో పాటు దాని పరిసర ప్రాంతాల ప్రజలకు ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరుస్తుందని విశ్వసిస్తున్నానని" తెలిపారు. వైజాగ్ క్లస్టర్ బిజినెస్ హెడ్ హైదర్ అలీ, డైరెక్టర్ ఆనంద్ జిలగం మాట్లాడుతూ పీఎంజే శ్రీకాకుళంలోని కొత్త స్టోర్ పీఎంజే జ్యువెల్స్ సంవత్సరాలుగా స్థాపించిన గొప్ప వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది" అని అన్నారు.జ్యువెల్స్‌లోని డిజైన్‌లు భారతీయ స్వర్ణకారుల అద్భుతమైన నైపుణ్యం, కళాత్మకతను ప్రతిబింబిస్తాయి. ఈ శుభ సందర్భంగా స్టోర్‌లో అలంకరించిన పీఎంజే ఆభరణాలను కస్టమర్‌లు తిలకించి కొనుగోలు చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వైస్సార్సీపీ కొత్తూరు మండల అధ్యక్షుడిగా గండివలస




**కొత్తూరు, ఫిబ్రవరి 7(వార్త) :** కొత్తూరు మండల వైస్సార్సీపీ మండల అధ్యక్షుడిగా గండివలస. ఆనంద రావు ని నియమిస్తూ వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం నాడు ఉత్తర్వులు వెలువడ్డాయి.పార్టీకి విశ్వసనీయత గా పనిచేస్తున్న తనపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవిని ఎంపిక చేసినందుకు వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అలాగే పాతపట్నం నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు రెడ్డి శాంతికి రుణపడి ఉంటానని గండివలస ఆనంద రావు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని అలాగే మండలంలోని వైస్సార్సీపీ నాయకులకు,కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానని తెలిపారు.




## మంచి నడవడికతోనే బంగారు భవిష్యత్

**మందస, ఫిబ్రవరి 7(వార్త):** విద్యార్థి దశ నుంచే మంచి నడవడికతో విద్యార్థులు మెలగాలని, దీంతో బంగారు భవిష్యత్ బాటలు వేసుకోవచ్చని కాశీబుగ్గరూరల్ సీఐ కె.తిరుపతిరావు, మందస ఎస్.ఐ. కె.కృష్ణప్రసాద్ కోరారు. మందస మండలంలోని హరిపురంలో సంకల్పం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, వాటితో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, చెడు అలవాట్లపై దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. తల్లిదండ్రులు ఆదేశాల మేరకు ఆయా విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దని కోరారు. రోడ్డు ప్రయాణాలు చేసేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీసీ కె. ఢిల్లేశ్వరావు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు బాగెమ్మపేటలో ఘనంగా భీష్మ ఏకాదశి



**వంగర, ఫిబ్రవరి 7(వార్త):** నేడు శనివారం నాడు వంగర మండలంలోని భాగెమ్మపేట గ్రామంలో ప్రతి ఏడాది భీష్మశుద్ధ ఏకాదశి ఘనంగా నిర్వహించ నున్నారు.ఈ మేరకు నిర్వాహకులు వెల్లడించారు.ప్రతీ ఏడాది ఆ గ్రామంలో భీష్మ ఏకాదశి నియెంతో ఘనంగా చేపడుతున్నారు.ఈపర్వదినంతో పాటు సామాజిక, విద్య అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఈ ఏడాది నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటన లోతెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మండలం కు చెందిన మరిచర్ల గంగారావు దంపతులను సత్కరించనున్నట్టు, అదేవిధంగా పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులను సన్మానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు ,యువకులు ,విద్యార్థులు ,వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అతిధులు పాల్గొ నున్నారని వారు తెలిపారు .ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే నని తెలియజేస్తూ,గ్రామస్థులుతదితర గ్రమాలవారు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

## బ్రహ్మోత్సవాలకు ఎంఎల్ఏ శిరీషకు ఆహ్వానం



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని బ్రహ్మోత్సవాలకు మీరూ రావాలి.. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలి.. సేవలో తరించాలి.. అంటూ పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషాను మందస పట్టణంలోని శ్రీవాసుదేవుని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు దేవరశెట్టి మార్కండేయులు, రాజాన మహేశ్, మాజీ సర్పంచ్ డుంకురు తిరుపతిరావు, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శిరీషాకు అందజేశారు. శ్రీవాసుదేవ పెరుమాళుని 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 17 నుండి 23 వరకు జరపడానికి మూహూర్తం నిర్ణయించారు.

## భాష్యం స్కూల్‌పై మండిపడ్డ హేమబాబు

**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** కాశీబుగ్గలోని బాష్యము స్కూల్లో అంతా అవినీతి మయముని తెలుగు దేశం నేత దువ్వాడ హేమ బాబూ చౌదరి ఆరోపించారు. శుక్రవారం ఆయన మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భాష్యం స్కూల్లో నాణ్యత గల ఉపాధ్యాయులు లేరు. విద్యార్థులకు తగిన సౌకర్యాలు, ఆటస్థలాలు లేవని ఆరోపించారు. ఇక్కడ సమస్యలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు హ్యూమన్ రైట్స్ కు,జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



# అభివృద్ధి ప్రదాత కూన రవికుమార్



**ఆమదాలవలస, ఫిబ్రవరి 7(వార్త):**అభివృద్ధి ప్రదాత కూన రవికుమార్ అని జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. ఇటీవల పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పి.యు.సి.) చైర్మన్‌గా నియమింపబడిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయన కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆమదాలవలస అభివృద్ధి కేవలం రవికుమార్‌తోనే సాధ్యపడుతుందన్నారు. ఎమ్మెల్యేగా అహర్నిశలు, అవిశ్రాంతంగా శ్రమించిన వ్యక్తి రవికుమార్ అని ఉద్ఘాటించారు. ఎంతో ఓపిగ్గా ప్రజా వినతులు స్వీకరించి, తానే స్వయంగా పరిష్కారం చూపుతుండడం హర్షనీయమన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో రూ.43 కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో సుమారు రెండు కోట్లతో సీసీ రహదారులు, మరో రెండు కోట్ల రూపాయలతో కాలువల నిర్మాణం చేపడుతున్నారన్నారు. సుమారు కోటి 40 లక్షలతో నియోజకవర్గంలో పంట కాలువల అభివృద్ధి పనులు మంజూరు చేయించారన్నారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళం వరకు ఉండే సీఎస్పీ రహదారి నిర్మాణం వేగవంతం చేసి ఇంచుమించు పూర్తి చేశారన్నారు. ఇందుకు సంబంధించి రూ.16 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల చేయించారన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో అత్యధికంగా రాయితీపై పశువుల శాలలు మంజూరు చేసి, వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయిస్తూ పాడిరైతుల పక్షపాతిగా రవికుమార్ నిలిచారన్నారు.కళింగ సంక్షేమ సేవాసంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు నిలువెత్తు రూపం, నిబద్ధతకు నిదర్శనం రవికుమార్ అన్నారు. జిల్లా తెలుగు దేశం పార్టీ నాయకులు నందివాడ గోవిందరావు, శివ్వాల సూర్యం, బూర్జ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాంజీ, కంట్లం మాజీ సర్పంచ్ గిరడ హరిబాబు, కోర్లకోట ఎంపీటీసీ భాస్కరరావు, డొంకలపర్త టీడీపీ నాయకులు జడ్డు కృష్ణ తదితరులు రవికుమార్ శుభాకంక్షలు తెలిపిన వారిలో వున్నారు.

# ఇసుక అక్రమ తరలింపును పట్టించుకోని అధికారులు



**వంగర, ఫిబ్రవరి 7(వార్త):** వంగర మండలంలోని మూడు నదుల వద్ద అక్రమ ఇసుక తరలింపులు జోరందుకొన్నాయి. నిత్యం ఇసుక అక్రమ తరలింపు జరుగుతున్నా పట్టించుకోవటంలేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వంగర మీదుగా రెవెన్యూ, పోలీస్‌స్టేషన్ ముందుగానే పట్టపగల, రాత్రి అనే తేడా లేకుండా ఎవరికి తోచినట్లు, వారు రోజురోజుకు ఇష్టానుసారంగా ట్రాక్టర్లతో అందరి కళ్ళ ముందు బరితెగించి ఇసుకను తరలించుకు పోతున్నారు. నాగావళి నది నుంచి ఓనెఅగ్రహారం, తలగాం,శివ్వాం,రుషింగి, వీవీ ఆర్ పేట గ్రామాల్లోని ఇసుక రేంపులు నుండి రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది ఇసుక ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇష్టాను సారంగా నదిని తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి అధికారుల కళ్ళ ముందు నుంచే ఎంత భారీగా ఇసుకను తరలిస్తున్న పట్టించుకోకపోవడం కారణాలు మరి వారికే తెలియాలి, దీనికి రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయన్నది గుసగుసలు. మండల కేంద్రం మీదుగా, మండల కేంద్రానికి సుమారుగా రెండున్నర కీలో మీటర్ల దూరంలో నుంచి, ఈ గ్రామాల పరిధిలో సచివాలయాలు ముందు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే, ఇటు మండల అధికారులు గానీ, సచివాలయ ఉద్యోగులు ఏమి పట్టనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమంగా ఇసుకాసురులు యథేచ్ఛగా గరుగుబిల్లి, రాజాం, బలిజిపేట, చీపురుపల్లి, తెర్లాం, విజయనగరం ఇతర ప్రాంతాలకు తరలించడంతోపాటు తోటల్లో ఇసుకను అక్రమ నిల్వలు ఉంచి రాత్రిపూట దూరప్రాంతాలకు ట్రాక్టర్ ల ద్వారా వేలాధి నుంచి లక్షలాది రూపాయలు వరకూ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరిగినా అధికారులకు చలనం లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నాగావళి నదుల నుండి ఈ మండలం, మండలేతర గ్రామాల నుండి మద్దువలస, కోడిశ,గలావల్లి, గంగాడ, ఉనుకూరు, కాగితాపల్లి గ్రామాల నుండి ట్రాక్టర్ల అధినేతలు కనుసన్నల్లోనే జరుగుతుందని మండలంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అడిగే వారు లేరనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వంగర మండల పరిధిలో మూడు నదులు వద్ద జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, ప్రభుత్వ సహజ సంపదను కాపాడి ఇసుకాసురులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జీడి రైతాంగాన్ని ఆదుకోవాలి



**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** ఉద్దానంలో పండిస్తున్న జీడి రైతంగంను ఆదుకోవాలని, జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి 80 కేజీల బస్తా రూ. 16 వేలుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, ఎపి జీడి రైతు సంఘం జిల్లా కార్యదర్శి తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఎపి జీడి రైతు సంఘం ఆద్వర్యంలో శుక్రవారం రాత్రి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు జీడి సమస్యల పై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా పిక్కలను కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కల దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. జీడి తోటలలో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలన్నారు. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని కోరారు. జీడి పంట విస్తరణకు జీడి తోటలు పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామి పథకం ద్వారా ఎకరం జీడి తోట అభివృద్ధికి మూడు సంవత్సరాలకు 94 వేల రూపాయిలు రైతులకు క్షేత్ర స్థాయిలో అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జీడి పంట ప్రాంతంలో జీడి పిక్కలు, జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. జీడి రైతులకు జీడి పిక్కలు ఆరబెట్టుటకు టార్పాలిన్లు ఉచితంగా అందించాలని, పలాస కేంద్రంగా రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీని పై ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందిస్తూ జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడం జరిగిందని, జీడి పండే ఇతర జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేతో కలిసి జీడి పంట మద్దతు ధర ప్రకటించడం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ గణపతి, జి బాలకృష్ణ, కోనేరు ఆదినారాయణ, మద్దు రాఘవరావు, జి నీలకంఠం, బర్ల గోపి, లండ జీవన్, సాల్ని కుర్మరావు, కోదండ రావు, దాసరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎలక్షన్ కోడ్‌తో అప్పయ్యదొర జయంతి వేడుకలు రద్దు



**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ ఉన్నందువలన దివంగత నేత మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్య దొర జయంతి వేడుకలు రద్దు చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ప్రతి సంవత్సరము ఫిబ్రవరి 8వ తేదీన కీర్తిశేషులు హనుమంతు అప్పయ్య దొర జయంతి కార్యక్రమము పండగ వాతావరణంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించేవారమని.

ఈయాడాది జరగవలసిన అప్పయ్య దొర జయంతి కార్యక్రమమును ఎలక్షన్ కోడ్ కారణంగా బహిరంగ ప్రదేశంలో నిర్వహించడం సాధ్యం కావడం లేదని, కావున నియోజకవర్గంలో పాటు జిల్లాలో నలుమూలల ఉన్న అప్పయ్య దొర అభిమానులు, శ్రేయోబి ,లాషులు గమనించవలసినదిగా కోరారు,

# దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ

**-డిపియన్ రోడ్డు విస్తరణకు నిధులు కేటాయింపు పై హర్షతీరేఖాలు.**

**-మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన స్థానిక నేతలు**

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 7(వార్త):** డోల– పోలాకి –నౌపడ రోడ్డు విస్తరణకు ఎట్ట కేలకు శుభం కార్డు పడింది. కొన్ని దశాబ్దాలు గా ఉరిస్తూ వస్తున్నా ఈ రహదారి విస్తరణ పనుల కు కేంద్ర మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడు చొరవ తో కార్యరూపం దాల్చిందని చెప్పక తప్పదు. డోల నుంచి వెంకటాపురం వరకు సుమారు 67 కిలోమీటర్లు పొడవున్న ఈ రహదారి విస్తరణ పనులకు కేంద్రం 126.20కోట్లు మంజూరు చేయడం స్థానికులు లో హర్షతి రేఖలు వ్యక్తం అవుతున్నాయి.నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, పలాస మండల తీర ప్రాంత ప్రజల కు ఈ రహదారి విస్తరణ పనులు వారి అభివృద్ధి కి ఎంతో దోహద పడనుంది. ఈమేరకు సంతబొమ్మాళి మండలం కు చెందిన పలువురు నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ దీనికోసం కృషి చేసిన మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.సంతబొమ్మాళి పిఏసియస్ మాజీ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్ కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్ర



మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఎన్నేళ్లు నాటి కల నెరవేరుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో ఇచ్చిన ప్రధానమైన హామీ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తు చేశారు. బ్రిటిష్ కాలం నుండి వచ్చిన రోడ్డు కు గత ప్రభుత్వాలు విస్తరణకు కృషి చేయకపోవడంతో ఎంతో నరకము అనుభవించామని అన్నారు. గతంలో ఎంతోమంది నాయకులు ఎన్నో వాగ్దానాలు చేశారే తప్ప రోడ్లు వేయలేదని అన్నారు. ఇదే రోడ్డులో గత ప్రభుత్వంలో ఓ మంత్రి ఉండేవారని కనీసము రోడ్ల వేద్దామని ప్రస్తావని తేలేదని గుర్తు చేశారు. నౌపడ పూండి



ప్రజలే కాక జిల్లా ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తారని తెలిపారు.అలాగే నౌపడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి ఈ ప్రాంతం ప్రజలు అభివృద్ధికి ఈ రహదారి విస్తరణ పనులు దిక్సూచి అని ఇందుకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి స్లాఘనీయమని ఈ సందర్భంగా వారికి కర్రి విష్ణుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఏది ఏమైనా సంతబొమ్మాళి మండలం అభివృద్ధిపదం లో పయనించడానికి మూలపేట పోర్టు, ఈ రహదారి విస్తరణ పనులు ఒక దిక్సూచిగా మారనున్నాయని విష్ణుమూర్తి హర్షం వ్యక్తం చేశారు .

# కూటమితోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ

**- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ రహదారులకు మహర్ధశ కలిగిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బొడ్డపాడు గ్రామం నుండి మందస గడూరు వరకు వయా పెదకోష్ట మీదుగా బి టి రోడ్ మంజూరు చేయమని పలాస నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌతు శిరీషకు ఆయా పంచాయతీల తరుపున వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఏ ప్రాంత అభివృద్ధికైనా గ్రామాల అభివృద్ధితోనే సాధ్యమని, రహదారి సౌకర్యం కలగడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు సంక్షేమ పథకాలు ఎన్ని ఇచ్చినా రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉంటేనే గ్రామాలు తద్వారా రాష్ట్రాలు దేశం బాగుపడుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గ్రామాల పట్ల నిర్లక్ష్యం వహించి పూర్తిగా భ్రష్టు పట్టించారని అన్నారు గ్రామాల నుండి రోగులు,



రవాణా దారులు రావాలంటే నరకం చూసే వాళ్ళని ఎద్దేవ చేశారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి పొరుగు రాష్ట్రాల వారు కూడా పెట్టుబడులు పెట్టడానికి పరుగులెడుతున్నారని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో దేశం నాయకులు కిక్కిర ఢిల్లీ రావు, తదితరులు ఉన్నారు.

# తండేల్ సినిమా చాలా బాగుంది!

**- నాగచైతన్య, సాయిపల్లవి నటనకు నీరాజనాలు!**

**- సూపర్‌హిట్ అంటున్న మత్యకారులు!**

**సోంపేట, ఫిబ్రవరి 7(వార్త):** మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో తెరకెక్కించిన తండేల్ సినిమా కు తొలి రోజు శుక్రవారం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఇది మన జీవితాలకు సంబంధించిన సినిమా అంటూ మత్యకారులు థియేటర్లో ఆనందంతో సందడి చేశారు. సోంపేట ఎస్ఎస్ మాక్స్ థియేటర్లో ప్రదర్శించిన ఈ సినిమాకు ఇచ్ఛాపురం ,సోంపేట కవిటి , కంచిలి, మండలాల పరిధిలోని మత్స్యకారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తండేల్ రాజుగా యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య,మత్స్యకార మహిళగా సాయి పల్లవిల నటనకు థియేటర్ చప్పట్లుతో మారుమ్రోగింది. ఆద్యంతం హీరో హీరోయిన్లు నటనకు అద్భుతంగా ఉందని, ముఖ్యంగా ఈ జిల్లాకు చెందిన మత్స్యకారుల యాషభాసలతో హీరో హీరోయిన్లు విశేషంగా ఆకట్టుకున్నారని ఈ సందర్భంగా ప్రేక్షకులు తెలిపారు. ఇంత మంచి చిత్రాన్ని నిర్మించిన అల్లు అరవింద్, బన్నీ వాసు చందు మొండేటి ఇతర సాంకేతిక వర్గానికి ప్రేక్షకులు అభినందనలు తెలిపారు. కళ్ళ కట్టినట్టుగా చిత్రాన్ని నిర్మించారని మత్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా మండలం డి మత్సలేసం , బడివానిపేట, కళింగపట్నం, వంశధార ,నాగావళి, శ్రీకాకుళం రైల్వే స్టేషన్లో కనిపించిన దృశ్యాలను ప్రేక్షకులకు విశేషంగా ఆకట్టుకున్నాయని మత్స్యకారులు పేర్కొన్నారు





## లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలి

**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని పలాస ఇంచార్జ్ మేజిస్ట్రేట్ సిహెచ్ హరిప్రియ కోరారు. శుక్రవారం పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు,పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీయే రాజ మార్గమని, కేసులు రాజీకి లోక్ అదాలత్ మంచి వేదిక గా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రమేష్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జి ఎం ఎస్ అనిల్ రాజు, న్యాయవాదులు బీకేర్ పట్నాయక్, హనుమంతు సుధారాణి,జి ప్రభాకర్, విఘ్నేశ్వరరావ్, కె దేవరాజు, రవి, కాశీబుగ్గ సి ఐ పి సూర్యనారాయణ, పోలీసుల సిబ్బంది, కోర్ట్ సిబ్బంది, సూపర్డెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానవునికి ప్రశాంతత



**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** ప్రతీ మనిషి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, దీంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలో గల డిమిరియా గ్రామంలో జరిగిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న శిరీషా మాట్లాడుతూ భగవంతుని సన్నిధిలో ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు ఆమె ఘనంగా స్వాగతం పలికారు. శ్రీఅభయాంజనేయస్వామికి ఎంఎల్ఏ శిరీషా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం



**వంగర, ఫిబ్రవరి 7(వార్త):** పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నకు సన్న బియ్యం ప్రవేశపెట్టి చక్కని పోషకాహార భోజనం అందిస్తున్నది కూటమి ప్రభుత్వమని రాజాం నియోజక వర్గ టీడీపీ అధ్యక్షులు, జిల్లా ఎస్సీ ఎస్టీ మొనటరింగ్, విజిలెన్స్ కమిటీ మజ్జి గణపతి అన్నారు.శుక్రవరంనాడు వంగర లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన వాట్సప్ లోనే టెన్త్, ఇంటర్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే గొప్ప అవకాశాన్ని కలిగించి విద్యా వ్యవస్థ పై నిరంతరం కొత్త ఆలోచనతో యువతకు విద్యార్థులకు అండగా నిలుస్తున్న భవిష్యత్ భరోసా రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రినారా లోకేష్ బాబు కు ఆయన కృతజ్ఞతలు తెలియ జేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా పాలనలో ప్రజలంతా పండగ చేసుకుంటున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో (తెలుగుదేశం, జనసేన, బిజెపి) కూటమి ప్రభుత్వం స్వర్ణ యుగ పాలన అందిస్తుందనిఅన్ని వర్గాల ప్రజల వారి అవసరాలకు ఆలోచనలకు ఆశయాలకు కోరికలుకు అనుగుణంగా ప్రజా రంజక పరిపాలనందిస్తుందని వివరించారు.ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్ కు భరోసా ఐటి, విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు తీసుకున్న సంచల నిర్ణయాలతో యువత విద్యార్థులు, ఆనందోత్సవాలు వెల్లి విరుస్తున్నాయని మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం పెట్టి ఏ ప్రాంతంలో వారికి ఇష్టమైన ఆహారం కావాలా ఆ ఆహారాన్ని అందించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. అలాగే టెన్త్, ఇంటర్ ఎగ్జామ్స్ హాల్ టికెట్స్ కూడా చక్కగా ఎవరిమట్టుకు వాళ్లే సైట్స్ , ప్రభుత్వ వాట్సాప్ సర్వీస్ మనమిత్ర 9552300009 నెంబర్ ద్వార డౌన్లోడ్ చేసుకునే గొప్ప అవకాశం కలిగిస్తున్నారని, రాబోయేమూడు నెలల్లో ఎన్నికల ఇచ్చిన హామీలలో మూడు పథకాలు ఆయా వర్గాలు కు అందించి రాష్ట్ర ప్రజల అందరూ కు అందించి రాష్ట్ర ప్రజల అందరూ సుఖ సంతోషాలతో ఉండేటట్లు ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఎన్నికల కోడ్ ముగిసాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం జరుగు తోందని, చెప్పింది చేసి చూపించే ప్రజా ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నా రు. అభివృద్ధి, సంక్షేమానికి లోటు లేకుండా అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546